

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 16.06.2026 | సంపుటి: 3 | సంచిక: 134 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 16.06.2026 | VOLUME : 3 | ISSUE : 134 | PAGES: 8 | COST: 2/- |



4
## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575




3

## 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షా లు

- నిరంతరం అప్రమత్తత అవసరం
- విపత్తుల నిర్వహణ యంత్రాంగం సిద్ధంగా ఉండాలి
- రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి



## మెట్రో విస్తరణకు మోకాలడ్డిన
# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- తెచ్చిన అప్పనకు వడ్డీ ఎవరు కట్టాలి?
- విస్తరణకు బాధ్యత తీసుకోండి లేదంటే ఎన్‌వోసీ ఇచ్చి తప్పకోండి
- కిషన్‌రెడ్డిని ప్రశ్నించిన సీఎం రేవంత్
- ఏమైనా మెట్రో ఫేజ్-2 పూర్తి మా లక్ష్యం

హైదరాబాద్, జూన్ 15(రాజముద్ర న్యూస్):

మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకుని మెట్రో ఫేజ్ 2 ను పూర్తి చేసుకోవడమే తమ లక్ష్యం అని జంటనగరాల ప్రజల", క్యూర్ పరిధిలోని ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

..మిగతా 2లో

## ఎస్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకోవద్దు

- టీపీసీసీ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి



2



2

## 25 నుంచి ఓటర్ల సమగ్ర సవరణ సర్వే

- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల



2

## షాదీ ముబారక్‌లో రూ.21 లక్షల కుంభకోణం

- అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్..
- రెవెన్యూ అధికారుల పాత్రపై సంచలన వెల్లడి

# యాక్టివ్ మోడ్‌లోకి కేసీఆర్

బస్సు యాత్రతో పొలిటికల్ ఫీల్డ్ లోకి బీఆర్ఎస్ బాస్ ● గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్
పార్టీ పునరుజ్జీవనమే లక్ష్యంగా వ్యూహాలు ●బీఆర్ఎస్ భవిష్యత్తుకు కీలకంగా మారనున్న యాత్ర



**తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారనే సంకేతాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టనున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లోనూ కొత్త చర్చకు తెరలేచింది.**

హైదరాబాద్, జూన్ 15 (రాజముద్ర న్యూస్):

గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్, అనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ తీవ్ర నిరాశను ఎదుర్కొంది. ఎన్నికల సమయంలో కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టినప్పటికీ పార్టీ ఒక్క లోక్‌సభ స్థానం కూడా గెలుచుకోలేకపోయింది. ఆ ఫలితాల తర్వాత కేసీఆర్ ఎక్కువగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇటీవల పార్టీ ప్లీనరీతో పాటు జగిత్యాలలో జరిగిన బహిరంగ సభలో మాత్రమే ఆయన ప్రజల ముందుకు వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో బస్సు యాత్ర ద్వారా పార్టీ శ్రేణులను మళ్లీ చైతన్యపరచాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, తదుపరి ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేయడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇదే సమయంలో అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే బాధ్యతను కేసీఆర్ కేటీఆర్, హరీష్ రావులకు అప్పగించినట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన రాజకీయ సవాళ్లకు నేరుగా స్పందించకుండా, పార్టీ తరఫున కేటీఆర్, హరీష్ రావులే ప్రధానంగా పోరాటం చేస్తున్నారు. రేవంత్ రెడ్డితో ప్రత్యక్ష రాజకీయ పోరాటం చేయడం కంటే ప్రజాక్షేత్రంలోనే తాను తన బలాన్ని నిరూపించుకోవాలనే వ్యూహాన్ని కేసీఆర్ అనుసరిస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో బస్సు యాత్రకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే గతంలో ఆశించిన ఫలితాలు ఇవ్వని బస్సు యాత్ర ఈసారి ఎంత మేరకు ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్, బీజేపీల్లో చేరడంతో పార్టీ బలం కొంత మేర తగ్గింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని తమకు

..మిగతా 2లో



# మోగిన బడి గంటలు

రాష్ట్రవ్యాప్తంగా తెరుచుకున్న స్కూళ్లు
మళ్లీ రోడ్డెక్కిన బస్సులు, ఆటోలు
కొన్నిచోట్ల విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

హైదరాబాద్, జూన్ 15 (రాజముద్ర న్యూస్):

వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ రోడ్లపైకి వచ్చాయి. స్కూళ్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి. తెలంగాణలో పాఠశాలలు తెరచుకోవడంతో తల్లిదండ్రులు మళ్లీ బిజీ అయ్యారు. కొత్త పుస్తకాలు.. ఏకరూప దుస్తులతో బడులకు వెళ్లే చిన్నారులతో సందడి నెలకొంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్తగా అల్పాహారాన్ని అందించనున్నారు. తొలి రోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవగా. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో

..మిగతా 2లో

## సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే కుట్రలు

- ఓపెన్ కాస్‌ట్‌ల విస్తరణతో సంస్థకు నష్టం
- సింగరేణి బకాయిలు రూ.50వేల కోట్లు చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్‌ఎంఎస్‌తో కలసి పోరాటం
- బొగ్గు బాయి బాట కార్యక్రమంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత



3

## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

- తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం
- మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు
- ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- డిప్యూటి సీఎం భట్టి సూచనలు



2

## ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షక పాత్ర

- మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
- జొన్న, మొక్కజొన్నలను ఎంఎస్పి పరిధిలోకి తేవాలి



3



2

## మెట్రోకు అనుమతులు రాకపోవడానికి రేవంత్ కారణం

- ఓటుకు నోటు కేసు వల్లనే కేంద్రాన్ని ప్రశ్నించడంలేదు
- మెట్రోరైల్ పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌దే
- కేసీఆర్ చొరవతో 72% పనులు పూర్తి
- కేంద్రంలో బీజేపీని అనలేక బీఆర్ఎస్‌పై విమర్శలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## ముగ్గురి ప్రాణాలు తీసిన ఫొటోషూట్ సరదా

చెరువులో పడి ముగ్గురు స్నేహితుల మృతి



2

# మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర సంపద

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహార పథకం
- కేజీబీవీ బాలికల మధ్య భట్టి బర్త్ డే వేడుకలు
- భట్టి నిరాడంబరతకు ఇదే నిలువెత్తు రూపం: మంత్రి పొన్నం
- కస్తూర్బా విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన భట్టి, పొన్నం
- గవర్నర్, సీఎం, మంత్రుల, ప్రముఖుల శుభాకాంక్షలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను అత్యంత ఆత్మీయ వాతావరణంలో విద్యార్థుల మధ్య సోమవారం జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఆయన సందర్శించారు



3

రాజముద్ర

# షాదీ ముబారక్‌లో రూ.21 లక్షల కుంభకోణం

- అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్..
- రెవెన్యూ అధికారుల పాత్రపై సంచలన వెల్లడి

**హైదరాబాద్, జూన్ 15:**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ పథకమైన షాదీ ముబారక్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి రూ.21 లక్షల ప్రభుత్వ నిధులను కాజేసిన అంతర్రాష్ట్ర ముఠాను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న స్పెషల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సహా మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. హసన్‌నగర్‌లోని ఫాతిమా కాలనీలో ఒక ఇంటిలో షాదీ ముబారక్ పథకానికి సంబంధించిన నకిలీ పత్రాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ ఎతిమాద్ ఉల్లాక్ నివాసంలో తనిఖీలు చేపట్టి భారీగా నకిలీ దరఖాస్తులు, గుర్తింపు పత్రాలు, కంప్యూటర్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో మహమ్మద్ ఎతిమాద్ ఆధార్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కంప్యూటర్ సాయంతో వధువుల ఫోటోలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఇతర అవసరమైన పత్రాలను ఫోర్జరీ చేసి నకిలీ దరఖాస్తులు రూపొందించినట్లు తేలింది. అనంతరం వాటిని బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి ప్రభుత్వ నిధులు మంజూరు అయ్యేలా కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలోని స్పెషల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ ధరావత్ అశోక్ కిరణ్ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించకుండా దరఖాస్తులను ఆమోదించి నిధుల మంజూరుకు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన నిందితులు నకిలీ లబ్ధిదారులను గుర్తించడం, బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించడం, అక్రమంగా వచ్చిన సొమ్మును పంచుకోవడంలో భాగస్వాములైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా ఇప్పటివరకు సుమారు రూ.21 లక్షల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, ఒక డెస్క్‌టాప్ కంప్యూటర్, ఆరు మొబైల్ ఫోన్లు, నకిలీ దరఖాస్తులు, ఫోర్జరీ చేసిన గుర్తింపు పత్రాలు, రూ.21 లక్షల విలువైన 21 చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

# 25 నుంచి ఓటర్ల సమగ్ర సవరణ సర్వే

- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల

**హైదరాబాద్, జూన్ 15:**

తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఈ నెల 25 నుంచి ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే (ఎస్ఐఆర్) నిర్వహించనుండగా, ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమాలు ఈ నెల 15 నుంచి 24 వరకు మూడు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో సర్వే నిర్వహణకు సంబంధించి బీఎల్ఓలు చేపట్టాల్సిన బాధ్యతలు, విధివిధానాలపై ప్రణాళిక రూపొందించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సన్నద్ధత కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండో దశలో జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బీఎల్ఓ పర్యవేక్షకులు, బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. మూడో దశలో ఇంటింటికి పంపిణీ చేసే ఎన్యుమరేషన్ పత్రాలను ముద్రించి సిద్ధం చేయనున్నారు. సన్నాహక కార్యక్రమాలు పూర్తయిన అనంతరం ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సవరణ సర్వే నిర్వహిస్తారు. అనంతరం జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు సందేహాస్పద ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నారు. ఈ సందర్భంగా గుర్తింపు పత్రాల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియలు చేపట్టనున్నారు. అన్ని దశలు పూర్తైన తర్వాత అక్టోబర్ 1న రాష్ట్రంలోని తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

# డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం



- తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం
- మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు
- ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- డిప్యూటి సీఎం భట్టి సూచనలు

**హైదరాబాద్, జూన్ 15:**

రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని, మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సోమవారం సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రాన్ని అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి సూచించారు.

# మెట్రో విస్తరణకు మోకాలడ్డిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

సచివాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ నగరానికి అంతర్జాతీయ ప్రమాణాలతో రవాణా సౌకర్యాలు ఉండాలని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, వైఎస్ హయాంలో అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి జైపాల్ రెడ్డి హైదరాబాద్‌కు మెట్రో ప్రాజెక్టు తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైఎస్ మరణానంతరం రోశయ్య హయాంలో మొదటి దశ మెట్రో కోసం ఒప్పందాలు జరగగా 2017 నాటికి మొదటి దశ పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రాజెక్టు మొదలైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక చారిత్రక కట్టడాల సాకుతో మెట్రో మొదటి దశను అడ్డుకున్నారని, కేసీఆర్ చర్యలతో మూడేళ్లు ఆలస్యమైందని, రూ.15 వేల కోట్ల ప్రాజెక్టు రూ.22 వేల కోట్లకు చేరిందని, ప్రాజెక్టు ఆలస్యం, కోవిడ్ ప్రభావంతో ఎల్ అండ్ టీ నష్టాల్లో కూరుకుపోయిందని ముఖ్యమంత్రి వివరించారు. పదేళ్లు గత ప్రభుత్వం విస్తరణకు ప్రయత్నించలేదని, వాళ్ల ఆస్తులు పెంచుకునేందుకు తప్ప ప్రజల కోసం ఆలోచించలేదని విమర్శించారు. హైదరాబాద్ మెట్రో 9వ స్థానానికి పడిపోయిందని, అందుకే ప్రజా ప్రభుత్వం రాగానే మెట్రో విస్తరణ జరగాలని నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఫేజ్ 2 కోసం ప్రధానితోపాటు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశామని, ఫేజ్ 1 నిర్మించిన ఎల్ అండ్ టీతోనే ఫేజ్ 2 నిర్మించాల్సి ఉంటుందని కేంద్రం నిబంధన పెట్టగా ఈ ప్రతిపాదనకు ఎల్ అండ్ టీ అంగీకరించలేదని చెప్పారు. గత నష్టాలతోనే సతమతమవుతున్న తమకు ఫేజ్ 2 నిర్మించడం కష్టమని, రూ.30 వేల కోట్ల ఆస్తి సృష్టించినా ఏటా రూ.400 కోట్లు నష్టం వస్తుందని తేల్చి చెప్పిందన్నారు. అందుకే ఫేజ్ 2 నిర్మాణంలో భాగస్వామ్యం కామని స్పష్టంగా చెప్పిందన్నారు. భవిష్యత్ నిర్వహణకు కూడా ఒప్పుకోమని తిరస్కరించగా దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని అడిగితే ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ఒక్కటే ఏకైక పరిష్కారం అని కేంద్రం చెప్పిందని వివరించారు. రూ.30 వేల కోట్ల ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తిని రూ.15 వేల కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని, రూ.13,600 కోట్లు 8.25 శాతం వడ్డీకి బ్యాంకుల్లో ఎల్ అండ్ టీ మెట్రోపై రుణం తెచ్చుకోగా ఆ లోన్ రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఐఆర్ఎఫ్‌సీ ద్వారా తక్కువ వడ్డీకి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకోవడానికి కేసీఆర్‌కు పీఎఫ్‌సీ, ఆర్ఈసీ ద్వారా పదేళ్లలో రూ.3 లక్షల 15 వేల కోట్లు ఎలాంటి గ్యారెంటీ లేకుండా మూడో కంటికి తెలియకుండా కేంద్రం 911.5 శాతం వడ్డీతో అప్పు ఇచ్చిందన్నారు. తాము ఐఆర్ఎఫ్‌సీని రుణానికి ఒప్పించామని, రూ.13,600 కోట్లు 4 శాతం వడ్డీకి జపాన్ సంస్థతో అప్పు తీసుకొచ్చామని, ఇది రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉందని సీఎం తెలిపారు. రూ.1400 కోట్లు మేం కట్టాల్సింది కట్టాం.. లోన్ వచ్చినట్లే అని అనుకుంటే కిషన్ రెడ్డి అడ్డుకున్నారు అని ఆరోపించారు. మే 20న ఖట్టర్‌ను, 21న అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ఇవ్వొద్దని చెప్పారు. అందుకే తాము కిషన్ రెడ్డి వెనక పడుతున్నామన్నారు. a నిధులు విడుదల కావాల్సి ఉంది.. ఆ బాధ్యత కిషన్ రెడ్డిదే.. మీకు కష్టమనుకుంటే మీ 50 శాతం భాగస్వామ్యం అవసరం లేదు.. మీరు ఎన్వోసీ ఇవ్వండి.. తామే పూర్తిగా భరించి మెట్రో విస్తరణ చేసుకుంటాం అని స్పష్టం చేశారు. మీరు సికింద్రాబాద్ ఎంపీగా ఉన్నారు.. నలుగురు మీ ఎంపీలు ఉన్న ప్రాంతంలోనే మెట్రో విస్తరణ జరగాల్సి ఉంది.. ఎందుకు కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోరు అని నిలదీశారు. వరంగల్ ఎయిర్ పోర్టు స్పీడ్ అయ్యాక వెళ్లి రామ్మోహన్ నాయుడిని కలిశాడు.. ఆ పనులు నిదానించాయి. జపాన్ సంస్థ ఇప్పటికే నిధులను ఐఆరఎఫ్‌సీకి విడుదల చేసింది.. కానీ అది రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయడంలేదు.. ఆ డబ్బులకు వడ్డీ ఎవరు కట్టాలో కిషన్ రెడ్డి చెప్పాలి అన్నారు. రిజర్వు బ్యాంకును ఒప్పించిన లెటర్ కూడా తీసుకెళ్లి ఇచ్చాం.. అయినా రుణం బదిలీ కాకుండా అడ్డుకున్నారని, దీనిపై కిషన్ రెడ్డి బాధ్యత తీసుకుంటారా లేదా లేకపోతే ఎన్వోసీ ఇచ్చి మీ భాగస్వామ్యం వదులుకుంటారా అని ప్రశ్నించారు. అలా చేస్తే మేమే మెట్రో ఫేజ్ 2 కట్టుకుంటామన్నారు.

హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే మేమూ చేస్తాం అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసరగా, సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హాలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

**ఏమీ అనకున్నా సవాళ్లు విసురుతున్నారు**

కేసీఆర్ రండ అని మాట్లాడితే ఆయన్ను కిషన్ రెడ్డి పల్లెత్తు మాట అనలేదు.. ఎదురు చెప్పలేదు.. తామేం అనకపోయినా తమపై సవాళ్లు విసురుతున్నారన్నారు. 122 కి.మీ మెట్రో రెండో దశకు కేంద్రం భాగస్వామ్యం తీసుకుంటుందా లేదా.. మెట్రో ఫేజ్ 2కు ఎన్వోసీ ఇస్తారా లేదా కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. ఇవాళ బదిలీ కావాల్సిన రుణాన్ని బదిలీ చేయించండి అని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డిపై తమకు గౌరవం ఉంది.. కానీ ఆయనపై అసహనం ఉంది అని సీఎం రేవంత్ అన్నారు. కిషన్ రెడ్డి వెనక కేటీఆర్ ఉన్నారు.. కేటీఆర్ కుట్రలకT కిషన్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. అహ్మదాబాద్, ఉత్తరప్రదేశ్, వైజాగ్‌కు కూడా మెట్రోను మంజూరు చేశారు.. కానీ తెలంగాణకు ఇవ్వడంలేదు. వివక్ష ఏస్థాయిలో ఉందో మీరే అర్థం చేసుకోండి.. రాజకీయాల కోసం నేను మాట్లాడటంలేదు అని క్యూర్, నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మెట్రోకు అనుమతులు రాకపోవడానికి రేవంత్ కారణం

- ఓటుకు నోటు కేసు వల్లనే కేంద్రాన్ని ప్రశ్నించడంలేదు
- మెట్రోరైల్ పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌దే
- కేసీఆర్ చొరవతో 72% పనులు పూర్తి
- కేంద్రంలో బీజేపీని అనలేక బీఆర్ ఎస్‌పై విమర్శలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 15 :**

తనపై వేలాడుతున్న ఓటుకు నోటు కేసు వల్లనే కేంద్రాన్ని ప్రశ్నించలేని అసమర్థతలో రేవంత్ రెడ్డి వున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధానిని ప్రశ్నించలేని అసమర్థుడు రేవంత్ రెడ్డి ప్రతిపక్షంపై నిందలు వేసే నీచ ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్ ఫ్లాప్ అయినందుకు, మొదటి దశను ఆగం చేస్తున్నందుకు సీఎం వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ పూర్తి చేసిన ఘనత ముమ్మాటికి కేసిఆర్ దేనన్నారు. 28 శాతం మెట్రో పనులు కూడా పూర్తి చేయకుండా ప్రాజెక్టును చిక్కుల్లో వదిలేసిన నాటి కాంగ్రెస్ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ చొరవ తీసుకుని 72 శాతం పనులను పూర్తి చేశారన్నారు. కేవలం తన స్వార్థ ప్రయోజనాలకోసం ఉనికిలో లేని ఊహా నగరానికి మెట్రో రెండో దశను రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. కానీ గత ప్రభుత్వం ట్రాఫిక్ రద్దీ, నగర విస్తరణ, ప్రజల రోజువారి అవసరాల కోసం మెట్రో రెండో దశను ప్రతిపాదించిందని గుర్తుచేశారు. 71 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినప్పటికీ తన 'బడేభాయ్'ని మెప్పించి ప్రాజెక్టును ఒప్పించలేకపోవడం రేవంత్ రెడ్డి చేతకానితనానికి, దద్దమ్మ పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డి తన అసమర్థతను దాచుకోవడానికి అనేక అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. యూపీ, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలను మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేకపోయారో ముందుగా ప్రజలకు జవాబు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం మెట్రో రెండవ దశకి అనుమతి దక్కకపోవడం అన్నారు. మెట్రో విస్తరణకు అనుమతి ఇవ్వని కేంద్రంపై ముఖ్యంగా ప్రధానమంత్రిని విమర్శించే సత్తా ధైర్యం రేవంత్ రెడ్డికి లేదన్నారు. బిజెపిని కాక ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ ని విమర్శించి ప్రజలను తప్పుదోవ పట్టించే నీచమైన ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారు. గతంలో కేసీఆర్ పాలనలో అనుమతులు, రుణాలు శరవేగంగా ఎలా వచ్చాయో, మీ దిక్కుమాలిన పాలనలో అవి ఎందుకు ఆగిపోయాయో ప్రజలకు అర్థమవుతోందన్నారు. బీఆర్ఎస్ పై, కేసీఆర్ పై పడి ఏడవడం తప్ప మీకు ఏ పని చేతకాదని నాలుగు కోట్ల తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని చెప్పడం అంటే మోదీ కన్నా కేసీఆర్ పవర్ ఫుల్ అని పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా అని ఎద్దేవా చేశారు. కేంద్రం సహకరించకపోయినా రుణాలు సాధించి మెట్రోను పరుగులు పెట్టించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని స్పష్టం చేశారు. మూడేళ్లలో మెట్రో నిర్మాణాన్ని పూర్తి చేసి నిత్యం ఐదు లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామంటే అది బీఆర్ఎస్ ప్రభుత్వ సమర్థత అని, అటువంటి మెట్రోపై చెత్తవాగుడు వాగడం సరికాదని హెచ్చరించారు. మెట్రో విస్తరణ పట్ల అద్భుతమైన విజయంతో అనేక ప్రణాళికలను గత ప్రభుత్వం రూపొందించిందన్నారు. రేవంత్ రెడ్డి మాదిరి స్వార్థ ప్రయోజనాల కోసం అసలు ఉనికిలో లేని ఊహాజనిత నగరానికి మెట్రో తీసుకువెళ్లాలన్న మాదిరి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచించలేదన్నారు. కేవలం ప్రజల ప్రయోజనాలు, సౌకర్యం కోసమే దృష్టిలో ఉంచుకొని మెట్రో ఫేజ్ 2ను ఆరు కారిడార్లు, 72 స్టేషన్లతో 76.4 కిలోమీటర్ల మేర డిజైన్ చేసింది కేసీఆరేనని, నలుదిశలా ఆరు రద్దీ రూట్లలో ప్రణాళికలు రచిస్తే, వాటిని పనికిరాని రూట్లు అంటూ ప్రజల్ని అవమానిస్తారా అని సీఎంను కేటీఆర్ నిలదీశారు. రెండున్నరేళ్లలో ఫేజ్ 2ను అటకెక్కించడం మీ వైఫల్యమని, అధికారంలోకి రాగానే శంషాబాద్ మెట్రోను రద్దు చేసిన ద్రోహం మీదేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బెదిరింపులు - ఆస్తుల కొల్లగొట్టే కుట్ర వల్లనే ఎల్ అండ్ టి పారిపోతున్నదన్నారు. మెట్రో ఫేజ్ 2కు ఎల్ అండ్ టీ అంగీకరించలేదని ఎందుకు బుకాయిస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ఏకంగా ఎల్ అండ్ టీ సీఎఫ్ఓనే బెదిరించి, పారిశ్రామికవేత్తల తలకు తుపాకీ పెట్టినట్లుగా భయభ్రాంతులకు గురిచేసి పారిపోయేలా చేసింది మీరే కదా అని ఆరోపించారు. 30 వేల కోట్ల మెట్రో ఆస్తులను, నడిబొడ్డున ఉన్న మెట్రో భూములను కొల్లగొట్టేందుకే సంస్థను వెళ్లగొట్టే కుట్ర చేశారని ఆయన మండిపడ్డారు.



# మోగిన బడి గంటలు

**మొదటి పేజీ తరువాయి..**

ఒకే ఒక పదో తరగతి విద్యార్థిని పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న బుధవారం, 19న శుక్రవారం ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

**రాజ్‌భవన్ స్కూల్‌లో బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్ పథకం ప్రారంభం**

వ్యాప్తంగా బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్ పథకం సోమవారం నుంచే ప్రారంభమైంది. రాజ్ భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. వారంలో 6 రోజులు బ్రేక్‌ఫాస్ట్ , పాలు, రాగి జావను అందిస్తున్నామని, దాదాపు రూ.800 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ స్కూల్లో చదివితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయనే రోజులు రానున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు కావాలి కానీ ప్రభుత్వ హాస్పిటల్స్, స్కూల్ వద్దు అనే భావన ఉందన్నారు. దాన్ని తొలగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

# యాక్టివ్ మోడ్‌లోకి కేసీఆర్

**మొదటి పేజీ తరువాయి..**

అనుకూలంగా మలచుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ యాత్ర బీఆర్ఎస్‌కు అత్యంత కీలకంగా మారనుంది. కేటీఆర్, హరీష్‌రావు పార్టీని ముందుండి నడిపిస్తున్నప్పటికీ, పార్టీ శ్రేణులను పూర్తిస్థాయిలో సమీకరించే నాయకత్వ ఆకర్షణ కేసీఆర్‌కే ఉందని భావిస్తున్నారు. ఈ బస్సు యాత్ర ద్వారా కేసీఆర్ తన సంప్రదాయ ఓటు బ్యాంకును తిరిగి కూడగట్టగలిగితే తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ త్రిముఖ పోటీ ఏర్పడే అవకాశం ఉంది. లేకపోతే రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్, బీజేపీ మధ్యే కేంద్రీకృతమై బీఆర్ఎస్ మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రావచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందుకే కేసీఆర్ చేపట్టనున్న బస్సు యాత్రను బీఆర్ఎస్ భవిష్యత్తును నిర్దేశించే కీలక రాజకీయ కార్యక్రమంగా భావిస్తున్నారు.

## ముగ్గురి ప్రాణాలు తీసిన ఫొటోషూట్ సరదా

**మేడ్చల్, జూన్ 15:**

మేడ్చల్ జిల్లా కీసర పోలీసు స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్ కోసం ఫొటోషూట్‌కు వచ్చిన ముగ్గురు యువకులు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ధర్మారం గ్రామంలోని బాణమ్మ చెరువు వద్ద సరదాగా ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు వచ్చిన ఆంటోనీ (18), జోసెఫ్ (18), టోనీ (17) ప్రమాదానికి గురయ్యారు. ఫొటోషూట్ సందర్భంగా నీటిలో పడిపోయిన హెడ్‌ఫోన్స్ తీసుకోవడానికి చెరువులోకి దిగిన యువకులు ప్రమాదవశాత్తూ నీటిలో గల్లంతయ్యారు. మృతులు బొల్లారం ప్రాంతానికి చెందిన స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరో యువకుడి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సరదాగా వెళ్లిన ముగ్గురు స్నేహితులు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియా కోసం ప్రాణాలకు ముప్పు కలిగించే సాహసాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ జిల్లా పోలీసులు హెచ్చరించారు.

# 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

- నిరంతరం అప్రమత్తత అవసరం
- విపత్తుల నిర్వహణ యంత్రాంగం సిద్ధంగా ఉండాలి
- రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్ జూన్ 15 :

నైరుతి రుతుపవనాలు రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ నెల 19నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగవచ్చని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే్ అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాలను అప్రమత్తం చేస్తూ అధికారులతో మంత్రి సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించగా ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతోందన్నారు. 14వ తేదీ నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాలు, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకాయని తెలిపారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా సుమారు 10 శాతం లోటు ఉందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బందితో నిరంతరం సమన్వయం కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమంటూ ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర సంపద

హైదరాబాద్, జూన్ 15 :

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను అత్యంత ఆత్మీయ వాతావరణంలో విద్యార్థుల మధ్య సోమవారం జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల బాలికల నవ్వుల మధ్య ఆయన తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవ డం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎంలు విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. సోమవారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా 29 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార(బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఇంటర్ చదువుతున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పిల్లలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు నాణ్యమైన యూనిఫామ్‌లు, షూస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈనాటి విద్యార్థులే రేపటి మానవ వనరులు, రాష్ట్ర సంపద. వారి విద్య, ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడదన్నారు. పోషకాలతో కూడిన ఆహారం అందిస్తేనే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదిగి ఈ పోటీ ప్రపంచంలో రాణించగలరు అని భట్టి పేర్కొన్నారు. విద్యార్థుల అవస్థలను గమనించిన ప్రజా ప్రభుత్వం 40% డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్ చార్జీలను పెంచిందని గుర్తు చేశారు. ఈ పాఠశాలలో అదనపు గదుల కోసం అంచనాలు పంపితే ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆర్థిక స్థోమత లేకపోయినా చదువుకోవాలనే బలమైన కోరిక ఉన్న బాలికల కోసమే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేజీబీవీలను తీసుకొచ్చాయని, దీనివల్ల బడి మానేసే బాలికల సంఖ్య చాలా తగ్గిందని గుర్తు చేశారు.

**నిరాడంబరతకు ఇదే నిదర్శనం: మంత్రి పొన్నం**

భట్టి విక్రమార్కపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసల జల్లు కురిపించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న పేద బాలికల మధ్యన జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం ఆయన నిరాడంబరతకు, సంస్కారానికి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలకు సంబంధించి పెండింగ్‌లో పెట్టిన డైట్, కాస్మెటిక్ బిల్లులను ఈ ప్రజా ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా వెనువెంటనే విడుదల చేసిందని గుర్తు చేశారు. డైట్, కాస్మెటిక్ చార్జీలను భారీగా పెంచినందుకు కేజీబీవీ విద్యార్థినులు ప్రభుత్వానికి, ముఖ్యంగా డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే తమ చేతుల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పెట్టడం పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తూ ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తమ మధ్య బర్త్‌డే జరుపుకోవడం ఎప్పటికీ మర్చిపోలేమని విద్యార్థినులు భావోద్వేగానికి లోనయ్యారు. స్థానిక కాంగ్రెస్ నేత భీమ్ భరత్ భట్టితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే పీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు చల్ల నరసింహారెడ్డి, అన్వేష్ రెడ్డి, కోట్నాక్ తిరుపతి, సిడబ్ల్యుసి సభ్యులు రుద్రరాజు, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.గవర్నర్, సీఎం, మంత్రులు, ప్రముఖుల శుభాకాంక్షలు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ప్రజాభవన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. గవర్నర్ శివప్రతాప్ శుక్లా విక్రమార్కకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స' వేదికగా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రియ సోదరుడు భట్టి మల్లుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.. రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడంలో మనం కలిసి మరింత ఉత్తమ ఫలితాల కోసం కృషి చేద్దాం' అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిప్యూటీ సీఎంకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భగవంతుడు దీర్ఘాయుష్షును, ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. కాగా, ఉదయం నుంచే ప్రజాభవన్‌కు మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు, అధికారులు భారీగా తరలివచ్చారు. బొకేలు, శాలువాలతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, అజహరుద్దీన్, సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, బీఎలఆర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, నరసింహారెడ్డి, పోదెం వీరయ్య, నాయుడు సత్యం, బండ్లు శోభారాణి, రాయల నాగేశ్వరరావు, శివసేనారెడ్డి, చరణ్ కౌశిక్, సరిత తిరుపతయ్య, బీసీ కమిషన్ మెంబర్ రాపోలు జయప్రకాష్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ స్నిగ్ధ పట్నాయక్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్‌కో సీఎండీ హరీష్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ తదితరులు ఉన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ భట్టి విక్రమార్కకి పుష్పగుచ్చం అందించి పట్టు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ఆరు గ్యారంటీల థీమ్‌తో 120 కేజీల భారీ కేక్ కటింగ్**

మధిర నియోజకవర్గం బోనకల్ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మినేని రమేష్‌బాబు ప్రత్యేకంగా 120 కేజీల భారీ కేకును తయారు చేయించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భట్టి విక్రమార్క చేపట్టిన చరిత్రాత్మక పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చిత్రాలతో ఈ కేకును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రజాభవన్‌లో భట్టి ఈ కేక్‌ను కట్ చేశారు.

## 'బాల్య వివాహం – బతుకు ఆగం'పై
# రాష్ట్రవ్యాప్త పోరు

- 'తరుణి'తో మహిళా శిశు సంక్షేమ శాఖ ఎంవోయూ

హైదరాబాద్, జూన్ 15 :

రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణలను అరికట్టేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక అడుగు వేసింది. ఈ దిశగా బాలికల సాధికారత, బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా నిరోధం వంటి అంశాల్లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న తరుణి స్వచ్ఛంద సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై సచివాలయంలో సోమవారం సంతకాలు జరిగాయి. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఒఝూ, తరుణి ఫౌండర్స్ మమతా రఘువీర్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది బాలికల భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం, ఆర్థిక స్వావలంబన దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. బాల్య వివాహంబతుకు ఆగం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా కేంద్రంగా ఈ ప్రచారం మరింత విస్తృతంగా జరగాలన్నారు. రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల నివారణకు ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు



చేస్తోందని, ఇప్పుడు తరుణి వంటి అనుభవజ్ఞ సంస్థ సహకారంతో ఈ ప్రయత్నాలను మరింత విస్తృత స్థాయిలో తీసుకెళ్తామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలికలకు వారి హక్కులు, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, సీడీపీవోలు, ఇతర శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచార కార్యక్రమాల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలు, మైనర్ గర్భధారణల ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్న మంత్రి 'ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునే వాతావరణం కల్పించడం మనందరి బాధ్యత.. బాల్య వివాహాలకు పూర్తిగా ముగింపు పలకడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పనిచేయాలి' అని పిలుపునిచ్చారు. మమతా రఘువీర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల తగ్గింపునకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సాంకేతిక సహకారం, అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బీజేపీ

- ఆ పార్టీ కుట్రలో పావుగా మారిన పవన్
- ఇష్టం వచ్చినట్లు తెలంగాణపై మాట్లాడితే ఊరుకోం
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 15:

పవన్ కళ్యాణ్ పదేపదే తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టిపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడటానికి ఇది సినిమా కాదని హితవు పలికారు. ఈమేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంపై, కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలపై కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ స్వతహాగా మాట్లాడడం లేదన్నారు. కేంద్రంలోని మోదీ, ఇతర బీజేపీ నేతలు కించపరిచేలా స్క్రిప్ట్ ఇస్తే, దాని ప్రకారం పవన్ మాట్లాడుతున్నారు. ఆయన పూర్తిగా బీజేపీ ఆడించే తోలుబొమ్మలా మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను పవన్ కళ్యాణ్ వ్యతిరేకిస్తూ మాట్లాడటం కొత్త కాదని, గతంలోనూ మోడీ సహా బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను అవమానించారని గుర్తుచేశారు. ఎంతోమంది యువకులు ప్రాణత్యాగం చేస్తే తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేశారని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ఉద్యమం జరుగుతున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు? ఏ సినిమాలో నటిస్తున్నారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమంటే సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులువు కాదని, నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను పవన్ చదువుకుంటే మంచిదని హితవు పలికారు. ప్రధాని మోడీ ఇవాళ రాకెట్ల ముందు నిలబడి ఫోటోలు దిగుతున్నారంటే ఆ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ చాలా పెద్ద హీరో కావడానికి తెలంగాణ ప్రజలు కూడా కారణమని, ఇక్కడి ప్రేక్షకులు చూడబట్టే ఆయన సినిమాలు ఆడాయనే విషయాన్ని మరువరాదని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు, ఆ విషయంలో ఆయన చాలా చిన్నవాడు. అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. రెండు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, కానీ తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని మహేష్ గౌడ్ అన్నారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని, ఏపీ సైతం మన వైపు చూసేలా ఇక్కడ పరిపాలన ఉందన్నారు. అయితే, తెలంగాణను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ ఇంతలా మాట్లాడుతున్నా బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వీరి మౌనం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టంగా అర్థమవుతోందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

# సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే కుట్రలు

మంచిర్యాల, జూన్ 15:

సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాదిమందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీ లేని పోరాటం చేయాల్సి ఉంటున్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే వెంటనే సింగరేణికి బకాయి ఉన్న రూ.50 వేల కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికికే దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా కాసిపేట మైన్ 1ను ఆమె సందర్శించారు. గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి వారి కష్టాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని కవిత మండిపడ్డారు. సంస్థ పరిరక్షణ కోసమే టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు విచిత్రవిధాలు ఇస్తూ కార్మిక రంగాన్ని మభ్య పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం పక్కనే ఉండి పోరాడాను. గతంలో మెడికల్ బోర్డు కోసం సింగరేణి భవన్‌ను ముట్టడించిన చరిత్ర మనది. కానీ ఈ ప్రభుత్వంలో సర్వసాధారణంగా జరగాల్సిన పనుల కోసం కూడా కార్మికులు రోడ్డెక్కి పోరాడాల్సి వస్తోంది అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీ సమస్యలను తీర్చడంలో, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అన్నింటిలో ప్రైవేట్‌ను తీసుకొచ్చి వైద్యాన్ని ఖరీదు చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే కార్మికుల రక్షణ కోసం, వారి కుటుంబాల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం అనే ఐదు కీలక అంశాలతో ముందుకు వచ్చిందని కవిత ప్రకటించారు.

# ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షక పాత్ర

- మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
- జొన్న, మొక్కజొన్నలను ఎంఎస్పి పరిధిలోకి తేవాలి

హైదరాబాద్, జూన్ 15:

రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస ధరలు వస్తాయని ఆశగా సాగు చేసిన రైతులకు న్యాయం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికైనా సేకరించిన పంటలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతోపాటు 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో మొక్కజొన్న సేకరణ చేపట్టిందన్నారు. జొన్న కొనుగోలుకు రూ.1100 కోట్లతో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. పిఎస్ఎస్ స్కీంలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటలపై 25శాతం సీలింగ్ పరిమితిని 50 శాతంకు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్న కేంద్రం నుంచి ఎటువంటి సమాధానం లేదని విమర్శించిన మంత్రి తుమ్మల రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా



రాష్ట్ర ప్రభుత్వం స్వంత నిధులతో రూ.4,000 కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. జొన్న పంటను కూడా రూ.1,000 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. సేకరించిన మొక్కజొన్న నిల్వ కోసం మొత్తం 15.07 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు అవసరమవుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11.40 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే అందుబాటులో ఉందని, దీంతో ఇంకా 3.29 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం అత్యవసరంగా అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు అదనపు గోదాములను వెంటనే గుర్తించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం మొత్తం 3 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమవుతుండగా, ఇప్పటివరకు 2 కోట్ల గన్ని బ్యాగులు సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన కోటి గన్ని బ్యాగులు వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అప్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన పంటను ఆలస్యం లేకుండా బరువు తూచి, గోదాములకు తరలించేందుకు తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి గోదాములకు పంట తరలింపులో ఆటంకాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు సూచించారు. మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వ ధర మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు స్పందన రాలేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం పీఎస్ఎస్ పరిధిలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుపై అమలులో ఉన్న 25 శాతం సీలింగ్‌ను వెంటనే 50 శాతానికి పెంచాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రికి మరోసారి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర రైతుల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి, శనగ, పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 50 శాతానికి పెంచించడంతో పాటు, మొక్కజొన్న, జొన్నలను పీఎస్ఎస్‌లో చేర్చేలా కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆ బాధ్యతల నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుని పనిచేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమమే పరమావధిగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.



# రాజకీయ చదరంగంలో ప్రాంతీయ పార్టీలు

## అస్తిత్వ పోరాటమా? ఆత్మసమర్పణమా?

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బీసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

- ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు





**వాషింగ్టన్, జూన్ 15:** పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. 3నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిర శాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

# కేరళలో నిఫా వైరస్ కలకలం

- కోజికోడ్ జిల్లాలో వ్యక్తికి నిఫా నిర్ధారణ
- మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స
- వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు






**తిరువనంతపురం, జూన్ 15:** దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్‌లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

# సీజేపీ సభలో అనూహ్య ఘటన

## అభిజిత్ దీప్కేపై దాడి..

## చెంపపై కొట్టిన దుండగులు

## దుండగులను చితక్కొట్టిన కార్యకర్తలు



**జైపూర్, జూన్ 15:** నీట్, సీబీఎస్ఈ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా రాజస్థాన్ జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన ధర్నాలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. గుర్తు తెలియని దుండగులు అతడిని చెంపపై కొట్టారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సీజేపీ కార్యకర్తలు దుండగులపై ఎదురు దాడి చేశారు. తనపై దాడి చేసిన వ్యక్తిని కొట్టొద్దని దీప్కే కోరినప్పటికీ సీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. దుండగులను చితకబాదారు. ఈ ఘటనతో ధర్నాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అభిజిత్‌ను అక్కడి నుంచి తరలించారు. సీజేపీ చీఫ్‌పై దాడి జరిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిజిత్ దీప్కేపై దాడిని నెటిజన్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తోన్న వారిపై భౌతిక దాడులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభిజిత్ పై దాడి చేసిన వ్యక్తులు ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్సీ వంటి ప్రధాన పరీక్షలలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగానే సోమవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సీజేపీ ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే హాజరై ప్రసంగించారు. అనుహ్యంగా ఈ ధర్నాలో ఆయనపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు

# అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

## ప్రమాదంలో 12 మంది దుర్మరణం

**వాషింగ్టన్,జూన్15:** అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.







# డివైన్ హోమ్స్‌లో రూబిక్స్ క్యూబ్ పోటీలు

## 70 మంది విద్యార్థుల ఉత్సాహం

**ముఖ్య అతిథి మిరియాల ప్రీతమ్**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్** :శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్‌లోని డివైన్ హోమ్స్ క్లబ్‌లో పోతన ధనలక్ష్మి ఆధ్వర్యంలో రూబిక్స్ క్యూబ్ పోటీలు వైభవంగా నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిరియాల ప్రీతమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, "రూబిక్స్ క్యూబ్ లాంటి పోటీలు విద్యార్థుల్లో సమయస్ఫూర్తి, సమస్య పరిష్కార నైపుణ్యం, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి" అన్నారు. పోటీలో విద్యార్థులు సెకన్లలో క్యూబ్‌ను పూర్తి చేయడం చూసిన వారందరికీ ఆశ్చర్యం కలిగించింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కలిగిన టీచర్ పోతన హిమజ చిన్న వయసులోనే పిల్లలకు రూబిక్స్ క్యూబ్ నేర్పించడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రులు, గురువుల సహకారంతో హిమజ దేశానికి మరిన్ని విజయాలు తెస్తుందని ఆకాంక్షించారు. పోటీల అనంతరం విజేతలకు మిరియాల ప్రీతమ్ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎస్. శ్రీనివాస్ రావుకు పోతన ధనలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలి

- ప్రజావాణిలో 95 అర్జీల దరఖాస్తులు స్వీకరణ
- అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టరు (95) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ.. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవికి మించిన సేవ.. పాలేరు ప్రజల మనసు దోచిన కందాళ ఉపేందర్ రెడ్డి

**అధికారం ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల వెంటే.. ఆపదలో అండగా నిలిచే ఆపద్బాంధవుడు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ప్రజాసేవకు పదవి అవసరం లేదని నిరూపిస్తున్న నాయకుడు కందాళ ఉపేందర్ రెడ్డి. పాలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ సీనియర్ నేతగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు నేడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. 'అధికారం శాశ్వతం కాదు, ప్రజల నమ్మకమే శాశ్వతం' అనే సిద్ధాంతంతో ప్రతి నిమిషం ప్రజల శ్రేయస్సు కోసం శ్రమిస్తున్న కందాళ, పాలేరు గడ్డపై చెరగని ముద్ర వేశారు.

**ఆలయాలకు అండ.. ఆధ్యాత్మిక సేవ**

పాలేరు నియోజకవర్గంలో ఏ మూలన దేవాలయ నిర్మాణం జరిగినా, జాతర జరిగినా కందాళ చేయూత తప్పనిసరిగా ఉంటుంది. "ఆయన డబ్బులు ఇవ్వని గుడి లేదు" అని స్థానిక అర్చకులు చెబుతుంటారు. గ్రామ దేవతల పండుగలకు, హనుమాన్ జయంతి, శివరాత్రి ఉత్సవాలకు స్వయంగా హాజరై ఆర్థిక సాయం చేయడమే కాకుండా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తుంటారు. మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్, క్రిస్మస్ వేడుకల్లోనూ పాల్గొని తన దాతృత్వాన్ని చాటుకుంటారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగు**

"చదువుకు పేదరికం అడ్డురాకూడదు" అనేది కందాళ బలంగా నమ్మే సిద్ధాంతం. అందుకే ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్న వందలాది మంది విద్యార్థులకు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ చదివే పిల్లలకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఆయన అండదండలు ఎప్పుడూ ఉంటాయి.



"ఆయన సహాయం పొందని విద్యార్థి పాలేరులో దొరకరు" అని యువత గర్వంగా చెప్పుకుంటుంది. నోట్ బుక్స్, స్కూల్ బ్యాగుల పంపిణీ నుండి ఉద్యోగ శిక్షణ కేంద్రాల ఏర్పాటు వరకు విద్యారంగంపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు.

**కష్టకాలంలో కొండంత అండ**

వరదలు వచ్చినా, అగ్నిప్రమాదం జరిగినా, ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే కందాళ అక్కడ ప్రత్యక్షమవుతారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందించి ధైర్యం చెబుతారు. కరోనా సమయంలో వేలాది కుటుంబాలకు నిత్యావసరాలు, మందులు పంపిణీ చేసి ఆదుకున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు వ్యక్తిగత సాయం చేసిన సందర్భాలు కోకొల్లలు.

**అభివృద్ధిలో తనదైన ముద్ర**

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాళేశ్వరం నీటితో పాలేరు చెరువులను నింపి చివరి భూములకు సాగునీరు అందించారు. రైతుబంధు, రైతుబీమా ప్రతి రైతుకు చేరేలా చేశారు. 24 గంటల ఉచిత కరెంట్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్కూల్ భవనాల నిర్మాణంతో నియోజకవర్గ రూపురేఖలు మార్చారు. దళితబంధుతో అనేక కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపారు.

**ప్రజల మాటే ఆయన బాట**

"మాటల్లో కాదు చేతల్లో చూపించే నాయకుడు కందాళన్న" అని పాలేరు ప్రజలు అంటున్నారు. గ్రామగ్రామాన తిరుగుతూ, ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ, అడుగడుగునా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. పదవి ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, లేనప్పుడు చేస్తున్న సేవ చూసి "మళ్లీ మా కందాళన్నే రావాలి" అని ప్రజలు కోరుకుంటున్నారు.

రాజకీయాలకు అతీతంగా మానవత్వాన్ని చాటుతున్న కందాళ ఉపేందర్ రెడ్డి లాంటి నాయకులు నేటి సమాజానికి ఎంతో అవసరం. పదవి కోసం కాకుండా ప్రజల కోసం బతికే ఆయన నిజమైన ప్రజానాయకుడు. పాలేరు గడ్డ మీద గులాబీ జెండాతో పాటు కందాళ పేరు కూడా శాశ్వతంగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

# మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ

**కాప్రా, రాజముద్ర న్యూస్:** మారుతి మిత్ర మండలి, కుషాయిగూడ వారి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం కుషాయిగూడలోని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిళలు లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామాల పారాయణం చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారుతి మిత్ర మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరుగంటి ఆంజనేయులు (హనుమంతు), మచ్చ బాబు గౌడ్, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, మన్మధరావు, అల్లా దుర్గం సతీష్, ఆంజనేయులు యాదవ్, వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.



# నేలకొండపల్లి పశువుల దవాఖానాకు మౌలిక వసతులు కల్పించాలి: బీజేపీ వినతి

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, మండల కేంద్రంలోని పశువుల దవాఖానాలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మండల తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు."దవాఖానాలో పశువుల బోన్ తొలగించడం వల్ల వైద్యం చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులు పశువులతో వచ్చి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. తక్షణమే బోన్ ఏర్పాటు చేయాలి" అని పాగర్తి సుధాకర్ తెలిపారు. కనీస వసతులు లేక రైతులు, పశువైద్య సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం స్వీకరించిన తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పురాణం దివాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, పుట్టా సత్యనారాయణ, సయ్యద్ మోహినుద్దీన్, ఎలిగేటి గిరి, ఎలిగేటి వెంకటేష్, పిట్టల సూరిబాబు, కందరబోయిన గోపి, కాళంగి వెంకటేశ్వర్లు, కొదమగుండ్ల స్వామీదాస్, తేజవత్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మండలంలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**అఖిల భారత విద్యార్థి పరిషత్**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేవెళ్ల నగర శాఖ ఆధ్వర్యంలో మండలంలోని విద్యాధికారి (ఎంఈఓ) కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ....విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పేర్కొన్న పలు సమస్యలు మీ దృష్టికి తీసుకురావడం జరిగిందని, చేవెళ్ల మండలంలోని అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అదనంగా పుస్తకాలు, యూనిఫామ్ లు, ఇతర విద్యాసామాగ్రిని నిర్దిష్ట దుకాణాల నుంచి కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారని. అలాగే విద్యార్థులపై అధిక విద్యా భారం మోపడం, ప్రత్యేక తరగతుల పేరుతో మానసిక ఒత్తిడి కలిగించడం జరుగుతుందని, కొన్ని విద్యా సంస్థలు సరైన అనుమతులు, మౌలిక సదుపాయాలు లేకుండా నిర్వహించుతున్నాయని ఆరోపణలు కూడా ఉన్నాయని వినతి పత్రంలో పేర్కొనడం జరిగింది. చేవెళ్ల మండలంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలపై ప్రత్యేకత తనిఖీలు నిర్వహించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వస్తువులు కల్పించి, నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థ పరిరక్షణ అంశాలపై తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కోరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలలో ఫీజు రాయితీ కల్పించండి

**వికారాబాద్ జిల్లా డీఈవో కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్** : వికారాబాద్ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరి పిల్లలకు పాఠశాల ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రామచందర్, జిల్లా కార్యదర్శి షఫీ లు అన్నారు, సోమవారం వికారాబాద్ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో డిఇఓ అబ్దుల్ ఘనికి ఫీజు రాయితీ విషయమై వినతి పత్రం అందించారు, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఇందుకు సంబంధించిన వివరాలను డి ఈ ఓ కు వివరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లా పరిధిలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇచ్చేలా తగు సూచనలతో ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిఇఓ వెంటనే తగు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు, టీడబ్ల్యూజేఎఫ్ నాయకుల విజ్ఞప్తికి సానుకూల నిర్ణయం పట్ల టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భీంశప్ప, మురళీమోహన్ గుప్తా, ఆనంద్, శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి చేన్ బసప్ప, హాఫీజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# చీకట్లోనే వారసంత



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** కేశవపట్నం బస్టాండ్ వెనుక ప్రతి సోమవారం నిర్వహించే వారసంత విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే కొనసాగుతోంది. సాయంత్రం వేళ చీకటి పడితే సంత ప్రాంగణం అంధకారంగా మారడంతో చిరువ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెలుతురు లేకపోవడంతో వ్యాపార లావాదేవీలు నిర్వహించడం కష్టంగా మారిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల అధికారులు స్పందించి సంత ప్రాంగణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి తగిన సౌకర్యాలు కల్పించాలని స్థానికులు, వినియోగదారులు కోరుతున్నారు.

## యాదవ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన యాదవ సంఘం సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అడితం కుమారస్వామిని సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా చుక్కల రవిని, ప్రధాన కార్యదర్శిగా జక్కుల గట్టయ్యను ఎన్నుకోగా, కోశాధికారిగా అడితం రాజును నియమించారు. కార్యవర్గ సభ్యులుగా నాయిని వెంకటేష్, అడితం ఐలయ్య, చుక్కల శ్రీకాంత్, నక్క ఓదెలు, అడితం రమేష్, కేశవేణి చేరాలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు అభినందించారు. సంఘ అభివృద్ధి, యాదవుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు సంఘ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

## ఆర్మీకి ఎంపికైన యువకుడికి ఘన సన్మానం





**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన అడితం విజయ్ భారత ఆర్మీకి ఎంపిక కావడంతో గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన యువకుడు దేశ రక్షణ బాధ్యతల్లో భాగస్వామి కావడం గర్వకారణమని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడు అడితం కుమార్, చుక్కల రవి, అడితం ఐలయ్య, మేడుదుల రాజు, రమేష్,గొర్ల అనిల్, నాయిని మల్లయ్య, నాయిని నాగరాజు, నాయిని సంపత్, అజయ్, ఐలు కొమురయ్య తదితరులు పాల్గొని అడితం విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** ఖమ్మం జిల్లాలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిపై వేగవంతమైన విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలని తెలంగాణ రక్షణ సేన మండల బాధ్యురాలు ఎండీ సల్మా డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ఖమ్మం జిల్లా తల్లంపాడుకు చెందిన 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేసి, ఘటన బయటపడుతుందనే భయంతో అపార్ట్మెంట్ పై నుంచి కిందకు తోసివేశారని ఆమె ఆరోపించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత కట్టుదిట్టమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు.





# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తో ప్రజల ప్రాణాలకు హానీ

- జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం..
- జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి..

**కీసర, రాజముద్ర న్యూస్:** కీసర సర్కిల్ పరిధి జవహర్ నగర్ జీ.హెచ్.ఎంసీ,(జన ప్రజావాణి) జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ జేఏసీ చైర్మన్ షేక్ షావాలి ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో జెఏసీ,కో కన్వీనర్లు,కమిటీ సభ్యులు కలెక్టర్ కు డంపింగ్ యార్డ్ సమస్యపై వివరించి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చెర్మెన్ షేక్ షావలి,జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు,గడ్డం సదానందం సిపిఐ (ఏం.ఎల్)మాస్ లైన్,సిపిఐ టి.శివనారాయణ,తెలంగాణ జన సమితి భద్రగమి ఆంజనేయులు,ఏ.ఐ. ఎఫ్.టి.యు వై.మాల్లేష్,జనవిజ్ఞాన వేదిక ఎం.శ్రీనివాస్,పిడియం చంద్రమౌళి,పీకేయం డి.జాన్,జనవాణి ప్రతాప్,సిఐటియు నర్సిగరావు,చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి,పిఓడబ్యు (విముక్తి) పేర్క సునీత,టియుసిఐ వి.ప్రవీణ్,దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య మహ్మద్ రషీద్ ద్రావిడ,కవి కళాకారుడు మేడ శ్రీను,శ్రావణ్ కుమార్,తెలంగాణ రాష్ట్రా వికలాంగుల సమితి మోనార్క్ దుర్గ ప్రసాద్,జర్నలిస్ట్ కొన్నె వేణు,సి.హెచ్ మాధవరెడ్డి,రాంపల్లి అశోక్ కుమార్,జీవివి పి.శేషగిరిరావు తదితరులు పై కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ...జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఆసియా కాండంలోనే అతిపెద్దదని,దాదాపు 390 ఎకరాల విస్తీర్ణంలో ఉందని,ఇప్పటికీ 95% చెత్తతో నిండిపోయిందని, రోజుకు 10 వేల టన్నుల చెత్త ఈ డంపింగ్ యార్డ్ కు వస్తుందని తెలిపారు. గంటకు 5.9 టన్నుల మిథున్ వెలువడుతుందని, గోల్కొండ కోటకంటే ఎత్తైన చెత్తగుట్టగా ఏర్పడిందని పేర్కొన్నారు. స్థానిక చుట్టు పక్కల ప్రాంతాలు ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు,డెంగ్యూ, మలేరియా,దీర్ఘకాలిక క్యాన్సర్ లాంటి అనేక ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయనే విషయాన్ని అనేక నివేదికలే తెలియజేస్తున్నాయని తెలిపారు. జవహర్ నగర్ లో మూడు లక్షల మందికి పైబడి బాధితులు ఉన్నారని, డంపింగ్ యార్డ్ చుట్టూ నాలుగు మండలాల పరిధిలో 15-20 లక్షల జనాభా ఇబందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలుషిత గాలి, విషపూరితమైన నీటిని త్రాగి ప్రతి ఇల్లు రోగాల నిలయమైందని, ప్రపంచంలోని అత్యధికంగా మిథేన్ ను విడుదల చేస్తున్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ నాల్గవ ప్రమాదవ ప్రాంతం అని అన్నారు. ప్రజల జీవితాలు,పిల్లల భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. భూగర్భం జలం పది కిలోమీటర్ల మేర కలుషితమైందని,ఈ డంపింగ్ యార్డ్ వల్ల అనేక రోగాలు విష వాయువులు వెలువడుతుండడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని,ఇప్పటికే వయస్సు నిండాకుండానే చిన్న పిల్లల నుండి పెద్దల వరకు మరణాలకు గురౌతున్నారని అన్నారు. మనిషికి భారత రాజ్యాంగం స్వేచ్ఛ,స్వతంత్రంతో జీవించే హక్కును కల్పించిందని అన్నారు. నేడు అలాంటి హక్కును జవహర్ నగర్ తో పాటు డంపింగ్ యార్డు చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలకు లేకుండా ప్రభుత్వ పాలకులు కాలరాయడాన్ని తీవ్రంగా ఖండించారు. త్రాగేనీరు,మంచి వాతావరణం,గాలి,ఆరోగ్య భద్రతలో భాగమని గుర్తుచేశారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన

ప్రభుత్వం స్పందించని ఎడల,రేపు జరగబోయే డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాటంలో నాలుగు మండలాల ప్రజలు, లక్షలాదిమందితో ప్రజా ఉద్యమంగా మారుతుందని అధికార పాలకులను హెచ్చరించారు.

# డైమండ్ మెంబర్షిప్ పేరుతో మోర్ సూపర్ మార్కెట్ మోసం

- మోర్ కంపెనిపై చర్యలు తీసుకోవాలి
- పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ డిమాండ్

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో ఆదివారం రోజు నూతనంగా ప్రారంభించిన మోర్ యాజమాన్యం వివిధ ఆఫర్ల పేరుతో మెంబర్షిప్ కార్డు పేరిటా కస్టమర్లకు చెప్పకుండానే నేరుగా బిల్లులో యాడ్ చేసి తీసుకున్న ఐటమ్స్ కంటే ఎక్కువ డబ్బులు తీసుకోవడంతో కొంతమంది వినియోగదారులకు అనుమానం వచ్చి బిల్ ను పరిశీలిస్తే మోర్ ప్లేస్ డైమండ్ సబ్స్క్రిప్షన్ 234 అని ఎక్స్ట్రా డబ్బులు తీసుకోవడం జరిగిందని వాపోడం బాధితుల వంతు అయింది. మోర్ లో ఐటమ్స్ తీసుకున్న వ్యక్తులు వెళ్లి విచారించగా, మేము ముందే చెప్పాము అన్నట్టుగా దబాయిస్తూ ఏం చేసుకుంటారో చేసుకోండని,




ఏ కోర్టులో కేసు వేస్తారో వేసుకోండి అంటూ అహంకారంతో మాట్లాడటం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఒక్కరోజే వందల మంది అందులో షాపింగ్ చేయడంతో, ఆ వందల మందిని మెంబర్షిప్ కార్డు తీసుకోండని ఏమాత్రం ముందుగా వివరించకుండా 234 రూపాయలు ఎక్కువగా కట్టించుకొని మోసానికి తెగబడ్డారు. గ్రామీణ ప్రాంతంలో మోర్ పెట్టి ప్రజలను మోసం చేసిన మోర్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రజలు ఎవ్వరు కూడా ఇలాంటి మోర్ సూపర్ మార్కెట్ లో వస్తువులు కొనవద్దని, రైతుల దగ్గర కొనాలని, ఆదివారం రోజు అందులో షాపింగ్ చేసిన అందరు వచ్చి మెంబర్షిప్ కోసం ఎక్స్ట్రా తీసుకున్న 234 రూపాయలను రిటర్న్ తీసుకోగలరు అని పిడిఎస్ యు తరుపున కోరుతున్నామని పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ తెలిపారు. అదేవిధంగా ఈ ఘటనపై చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డికి, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

# కార్మికుల ఐక్యతతో 'పని బంద్' (సమ్మె) విజయవంతం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేష్ వంశరాజ్
- తాపీ మేస్త్రీల స్లాబ్ రేటు రూ.450 లు నిర్వహించారు.
- రాష్ట్ర కార్యదర్శి వాసంశెట్టి శ్రీనివాస్..

**కీసర, రాజముద్ర న్యూస్:** భవన నిర్మాణ రంగ కార్మికుల సుదీర్ఘ పోరాటానికి, ఐక్యతకు ఎట్టకేలకు విజయం సాధించామని, కార్మికులు తమ న్యాయమైన వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ భవన,ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా దమ్మాయిగూడ డివిజన్‌లో కొనసాగుతున్న 'పని బంద్' (సమ్మె) కార్యక్రమం కార్మికుల ఆశయ సాధనతో విజయవంతంగా ముగిసిందన్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా కార్మికుల పోరాటానికి వివిధ ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున సంఘీభావంతో మద్దతు ప్రకటించాయి. ప్రతిరోజు

కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు దక్కాలనే పట్టుదలతో కొనసాగుతున్న సమ్మెకు ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సంఘం నేడు ఒక కీలక నిర్ణయానికి వచ్చిందనీ, తాపీ మేస్త్రీల శ్రమను గుర్తిస్తూ, వారి పని రేట్లను, స్లాబ్





ఏరియా ధరను రూ.450గా నిర్ణయిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇకపై కొత్తగా ఒప్పందం కుదుర్చుకునే బిల్డింగ్‌లన్నింటికీ ఈ నూతన రేట్ల ప్రకారమే పనులు జరుగుతాయని, కార్మికులకు నూతన వేతనాలు అందుతాయని యూనియన్ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా అందరి ఆమోదంతో రూపొందించిన నూతన ధరల పోస్టర్,పాంప్లెట్‌ను సంఘం నాయకులు అధికారికంగా విడుదల చేశారు. "కార్మికుల హక్కుల కోసం, న్యాయమైన వేతనాల కోసం ఐక్యంగా పోరాడితే సాధించలేనిది ఏదీ లేదు. ఈ విజయం దమ్మాయిగూడ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులందరి శ్రమకు దక్కిన గౌరవం. భవన కార్మికుల సమ్మె విజయవంతమైన ముగింపు కార్యాక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి వాసంశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదం బాబు, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షులు బి. సులోమాన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం భవిష్యత్తులోనూ ఇదే రకమైన ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూనియన్ ప్రతినిధులు నిర్మాణ రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సమ్మె ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణపై సమీక్ష సమావేశం

- బాధితులకు సకాలంలో న్యాయం అందించాలి
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సోమవారం వికారాబాద్ జిల్లా పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్పీ ప్రతి విభాగానికి సంబంధించిన పెండింగ్ ఫైళ్లను సమీక్షించారు. దర్యాప్తులో జరుగుతున్న జాప్యాలపై అధికారులను ప్రశ్నించారు. బాధితులకు సకాలంలో న్యాయం అందించడం పోలీసు వ్యవస్థ ప్రథమ కర్తవ్యమని పేర్కొంటూ, ప్రతి కేసును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాత కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు నిఘా నేత్ర కార్యక్రమంలో భాగంగా కొత్త సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, పనిచేయని పాత కెమెరాల మరమ్మతులు, అలాగే ప్రతి కెమెరాను జియో-ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. తద్వారా నేరస్థలాల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో 7 ఇంటిగ్రేటెడ్ ఫార్మ్స్‌ను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు సంబంధించిన ప్రతి అంశంపై ఎస్‌హెచ్‌ఓకు పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ప్రతి పోలీసు స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రక్షణ నేత్రం, సురక్షా మిత్ర వంటి కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, వారిని కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి, తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హెడ్ పోలీస్ సిబ్బంది కి ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# అమెరికాపై అద్భుత పునరాగమనం చేసిన భారత మహిళల హాకీ జట్టు

**న్యూజిలాండ్, జూన్ 15:** ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత మహిళల హాకీ జట్టు ఉత్కంఠభరిత విజయంతో టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించింది. తొలి మ్యాచ్‌లో అమెరికా జట్టుపై 3-2 గోల్స్ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. మ్యాచ్ ప్రారంభం నుంచే అమెరికా జట్టు దూకుడు ప్రదర్శించింది. ఫస్ట్ క్వార్టర్‌లో వరుసగా రెండు గోల్స్ సాధించి 2-0 ఆధిక్యంలోకి వెళ్లడంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది. ఈ దశలో మ్యాచ్ పూర్తిగా అమెరికా చేతుల్లోకి వెళ్తుందన్న అంచనాలు కూడా వినిపించాయి. అయితే రెండో క్వార్టర్‌లో భారత జట్టు అసాధారణ పునరాగమనం చేసింది. ఆత్మవిశ్వాసంతో ఆటను మార్చిన భారత్ వరుసగా మూడు గోల్స్ సాధించి మ్యాచ్‌ను పూర్తిగా తనవైపు తిప్పుకుంది. భారత్ తరఫున దీపిక రెండు కీలక గోల్స్ సాధించగా, నవనీత్ ఒక గోల్‌తో స్కోరుబోర్డును సమం చేసి ఆధిక్యాన్ని అందించారు. ఈ మూడు గోల్స్‌తో భారత్ 3-2 ఆధిక్యంలోకి వెళ్లి చివరి వరకు ఆ లీడ్‌ను కాపాడుకుంది. చివరి క్వార్టర్లలో అమెరికా జట్టు తిరిగి గోల్స్ సాధించేందుకు ప్రయత్నించినప్పటికీ భారత డిఫెన్స్ సమర్థంగా నిలిచి ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. దీంతో భారత్ ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. క్రికెట్‌లో పాకిస్థాన్‌పై టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత వెంటనే హాకీలోనూ అమెరికాపై గెలవడంతో భారత క్రీడాభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.





## మరోసారి నిరాశపరిచిన వైభవ్

**కొలంబో, జూన్ 15:** భారత 'ఎ' జట్టు తరఫున ఆడుతున్న యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి నిరాశపరిచాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక 'ఎ' జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో అతడు ఆశించిన స్థాయిలో రాణించలేక త్వరగానే పెవిలియన్ చేరాడు. ఇటీవల దేశీయ టోర్నీల్లో, ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో 21 పరుగులకే అవుటయ్యాడు. శ్రీలంక బౌలర్ సమన్ అరాచిగే బౌలింగ్‌లో అతడు వికెట్ సమర్పించుకున్నాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేక 11 పరుగుల వద్ద వెనుదిరిగాడు. షిరాజ్ బౌలింగ్‌లో అతడు అవుట్ కావడంతో భారత 'ఎ' జట్టు 39 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ల వైఫల్యంతో జట్టు ఒత్తిడిలో పడగా, కెప్టెన్ తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇద్దరూ జాగ్రత్తగా ఆడుతూ స్కోరును ముందుకు నడిపించారు. మ్యాచ్ ప్రారంభ దశలోనే రెండు వికెట్లు కోల్పోయినప్పటికీ మధ్యవరుస బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడితే భారత 'ఎ' జట్టు పోటీ స్కోరు సాధించే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 13 ఓవర్లు ముగిసే సమయానికి భారత 'ఎ' జట్టు 2 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ 23 పరుగులతో, తిలక్ వర్మ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు.

## ప్రపంచకప్ ఆర్చరీలో బొమ్మదేవర ధీరజ్ డబుల్ గోల్డ్



**విజయవాడ, జూన్ 15:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్రశ్రేణి ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ అద్భుత ప్రదర్శనతో రెండు స్వర్ణ పతకాలు సాధించి దేశ ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై చాటాడు. రికర్వ్ విభాగంలో జరిగిన ఈ పోటీల్లో ధీరజ్ తన అసాధారణ నైపుణ్యంతో వరుస విజయాలు సాధించి 'డబుల్ గోల్డ్' సాధించాడు. మొదటగా మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన 17 ఏళ్ల కుంకుమ్ మొహోద్‌తో కలిసి భారత్‌కు స్వర్ణ పతకం అందించాడు. ఆ తర్వాత జరిగిన రికర్వ్ వ్యక్తిగత విభాగంలో కూడా అదే ఫామ్‌ను కొనసాగించిన ధీరజ్, ఫైనల్‌లో అద్భుత ప్రదర్శనతో మరో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ విజయంతో ఒకే టోర్నీలో రెండు బంగారు పతకాలు సాధించిన అరుదైన ఘనతను నమోదు చేశాడు. ఈ అసాధారణ విజయంతో ధీరజ్ ప్రతిష్టాత్మక వరల్డ్ కప్ ఫైనల్స్‌కు అర్హత సాధించి మరో చారిత్రాత్మక మైలురాయిని చేరాడు. ధీరజ్ విజయంపై రాజకీయ, క్రీడా వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ధీరజ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యువ ఆర్చర్ ప్రదర్శన దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని పలువురు క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



## ఏఐ వీడియోతో క్రికెట్ అభిమానుల్లో గందరగోళం

**బర్మింగ్‌హామ్, జూన్ 15 :** కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధితో నకిలీ వీడియోల ముప్పు పెరుగుతోంది. తాజాగా భారత్--పాకిస్థాన్ మహిళల టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌కు సంబంధించి కృత్రిమ మేధతో రూపొందించిన ఒక నకిలీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో క్రికెట్ అభిమానులు గందరగోళానికి గురయ్యారు. వైరల్ అవుతున్న వీడియోలో భారత, పాకిస్థాన్ మహిళా క్రికెటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగినట్లు చూపించారు. భారత బ్యాటర్‌ను పాకిస్థాన్ క్రీడాకారిణి రెచ్చగొట్టినట్లు, అనంతరం ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు చిత్రీకరించారు. అంపైర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చినట్లు కూడా వీడియోలో చూపించారు. అయితే మ్యాచ్‌లో వాస్తవానికి ఇలాంటి ఘటన ఏదీ జరగలేదని స్పష్టమైంది. కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన ఈ నకిలీ వీడియోను కొందరు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో అభిమానులు మొదట నిజమని భావించారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ అద్భుత విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. గ్రూప్-ఏలో భాగంగా జరిగిన పోరులో పాకిస్థాన్‌పై 64 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. ఉప కెప్టెన్ స్మృతి మంధాన 68 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 36 పరుగులు చేసింది. రిచా ఘోష్ 34 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు భారీ స్కోరు అందించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పాకిస్థాన్ జట్టు భారత స్పిన్నర్ల ధాటికి 17 ఓవర్లలో 106 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ మునీబా అలీ 41 పరుగులతో పోరాడినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ ఐదు వికెట్లు తీసి పాకిస్థాన్ పతనాన్ని శాసించింది. తెలుగు యువ బౌలర్ శ్రీచరణి మూడు వికెట్లు పడగొట్టి ఆకట్టుకుంది. అద్భుత ప్రదర్శన చేసిన దీప్తి శర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో టోర్నీలో భారత్ శుభారంభం చేయగా, తదుపరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో తలపడనుంది. మరోవైపు కృత్రిమ మేధతో రూపొందించిన నకిలీ వీడియోల పట్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కోహ్లీపై రవిశాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూన్ 15:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మైదానంలో కోహ్లీ అహంకారి, పొగరుబోతుగా కనిపిస్తాడన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, అది పూర్తిగా నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. కోహ్లీకి సంబంధించిన 'వన్8' లైఫ్‌స్టైల్ బ్రాండ్ నిర్వహించిన సంభాషణలో రవిశాస్త్రి మాట్లాడుతూ.. "మైదానంలో కోహ్లీ అత్యంత దూకుడుగా, అగ్రెసివ్‌గా ఉంటాడు. కానీ అది కేవలం ఆటపైన ఉన్న ప్యాషన్ మాత్రమే. దాన్ని అహంకారంగా భావించడం సరికాదు" అని అన్నారు. ఆట ముగిసిన వెంటనే కోహ్లీ వ్యక్తిత్వం పూర్తిగా మారిపోతుందని రవిశాస్త్రి వెల్లడించారు. "ఫీల్డ్ బయట అతను చాలా వినమ్రంగా, సౌమ్యంగా ఉంటాడు. అందరితో ఆత్మీయంగా మాట్లాడే వ్యక్తి" అని ఆయన పేర్కొన్నారు. కోహ్లీ గురించి సమాజంలో ఉన్న అతిపెద్ద అపోహ ఇదేనని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. మైదానంలో కనిపించే అగ్రెషన్‌ను వ్యక్తిత్వంగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. 2017-2021 మధ్య కోచ్-కెప్టెన్‌గా వీరిద్దరి కలయికలో భారత జట్టు అనేక చారిత్రాత్మక విజయాలు సాధించిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా విదేశీ గడ్డపై టెస్టు విజయాలు ఈ ద్వయం సమన్వయానికి నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## ఫిఫా వరల్డ్‌కప్‌లో కొత్త ఒరవడి

### క్రికెట్ 'స్నికో మీటర్' పనికొచ్చిందిలా!

ఆద్యంతం ఉత్కంఠగా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ అభిమానులను అలరిస్తోంది. ఈసారి సాకర్ పండుగ ప్రత్యేకత ఏంటంటే.. మునుపెన్నడూ లేని విధంగా గోల్ నిర్ధరణ కోసం క్రికెట్ పరిజ్ఞానం ఉపయోగించారు. క్రికెట్‌లో చాలా సాధారణంగా కనిపించే స్నికో మీటర్ వాడకం అందరిలోనూ ఆసక్తి రేపింది. స్వీడన్, ట్యునీషియా మ్యాచ్‌లో స్నికో మీటర్ ఆధారంగా గోల్ వేసింది ఎవరు? అనేది నిర్ణయించారు. గ్రూప్ ఎఫ్‌లోని స్వీడన్ తొలి మ్యాచ్‌లో అదరగొట్టింది. ట్యునీషియాపై 5-1తో జయభేరి మోగించి ముందంజ వేసింది. అయితే.. మ్యాచ్‌లో నాలుగో గోల్ నిర్ధరణపై ఉత్కంఠ నెలకొనగా రిఫరీలు క్రికెట్ పరిజ్ఞానాన్ని ఆశ్రయించారు. క్రికెట్‌లో బ్యాట్‌కు బంతి తగిలిందా? లేదా? అనేది తెలుసుకోవడం కోసం ఉపయోగించే ఈ సాంకేతికతను గోల్ నిర్ధరణకు వాడారు. సబిస్టిట్యూట్‌గా వచ్చిన మాట్టియాస్ స్వాన్‌బెర్గ్ 18 సెకన్లలోనే గోల్ కొట్టగానే స్వీడన్ ఆటగాళ్లు సంబురాల్లో మునిగిపోయారు. అయితే.. అసిస్టెంట్ రిఫరీ మాత్రం కార్డు చూపిస్తూ గోల్ కాదని చెప్పాడు. దాంతో, స్వీడన్ ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. అలెగ్జాండర్ ఇజాక్ కాలు సైతం తగిలినట్టు అనిపించడంతో గోల్ కొట్టింది ఎవరు? అనేది తేల్చడం కోసం రిఫరీలు స్నికో మీటర్ సాయం తీసుకున్నారు. స్నికోలో ఇజాక్ కాలు దాటిన తర్వాత స్పైక్ కనిపించింది. సో.. ఆ గోల్ కొట్టింది స్వాన్‌బెర్గ్ అని తేలింది.

## భారత్ చేతిలో పాక్ ఓటమి

### హ్యాండ్‌షేక్ వివాదంపై చర్చ



**బర్మింగ్‌హామ్, జూన్ 15 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. అయితే మ్యాచ్ అనంతరం కూడా ఇరుజట్ల ఆటగాళ్లు హ్యాండ్‌షేక్ చేసుకోకపోవడం మరోసారి వివాదానికి దారి తీసింది. మ్యాచ్ ప్రారంభంలో టాస్ సమయంలోనూ, ఆట ముగిసిన తర్వాతనూ ఇరుజట్ల ఆటగాళ్లు పరస్పరం హ్యాండ్‌షేక్ చేయకపోవడం గమనార్హం. దీనిపై క్రికెట్ వర్గాల్లో, అభిమానుల్లో చర్చ మొదలైంది. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో పాకిస్థాన్ మహిళల జట్టు కోచ్ వహాబ్ రియాజ్‌ను ఈ అంశంపై ప్రశ్నించారు. ఆయన స్పందిస్తూ, హ్యాండ్‌షేక్ జరగకపోవడానికి గల అసలు కారణాలపై తనకు స్పష్టమైన సమాచారం లేదని చెప్పారు. తాను చాలా కాలం క్రితమే క్రికెట్‌కు దూరమయ్యానని పేర్కొన్న ఆయన, "ఇలాంటి పరిస్థితులు కొనసాగాలనుకుంటే అలాగే కొనసాగనివ్వాలి. హ్యాండ్‌షేక్ వల్ల పెద్దగా మార్పు ఏమీ ఉండదు" అని వ్యాఖ్యానించారు. మ్యాచ్ విషయానికి వస్తే భారత మహిళల జట్టు ఆరంభం నుంచే ఆధిపత్యం చూపించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. భారత ఇన్నింగ్స్‌లో స్మృతి మంధాన అద్భుతంగా ఆడి 68 పరుగులు సాధించగా, హర్మన్‌ప్రీత్ కౌర్ 36 పరుగులు చేశారు. రిచా ఘోష్ 34 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు స్కోరు పెంచారు. లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ జట్టు భారత స్పిన్నర్ల ముందు తేలిపోయింది. 17 ఓవర్లలో 106 పరుగులకే ఆ జట్టు ఆలౌట్ అయింది. ఓపెనర్ మునీబా అలీ 41 పరుగులతో కొంత ప్రతిఘటన చూపినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత విజయంలో దీప్తి శర్మ ప్రధాన పాత్ర పోషించింది. ఆమె ఐదు వికెట్లు తీసి పాకిస్థాన్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చింది. ఇదే ప్రదర్శనతో మహిళల టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు (166) తీసిన బౌలర్‌గా ఆమె కొత్త రికార్డు సృష్టించింది. శ్రీచరణి మూడు వికెట్లు తీసి అద్భుతంగా సహకరించారు. ఈ విజయంతో భారత మహిళల జట్టు టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించింది. మరోవైపు హ్యాండ్‌షేక్ వివాదం మాత్రం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# 'వారణాసి' క్లైమాక్స్‌కు భారీ ఏర్పాట్లు

## మహేష్ - రాజమౌళి చిత్రంలో గ్రాండ్ యాక్షన్ ఎపిసోడ్!

సూపర్ స్టార్ మహేష్‌బాబు, దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం *'వారణాసి'*పై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్ర బృందం క్లైమాక్స్ చిత్రీకరణకు సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నారని, అందులోనే కీలక పోరాట సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా మహేష్ బాబు అభిమానులను ఆకట్టుకునేలా ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక కథలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా జోనస్ 'మందాకిని' పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతుండగా, మహేష్ బాబు 'రుద్ర' పాత్రతో పాటు మరో కీలక పాత్రలోనూ నటిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశాలపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత కేఎల్ నారాయణ నిర్మిస్తుండగా, ఎస్ ఎస్ కార్తికేయా నిర్మాణ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. సంగీతాన్ని ఎం ఎం కీరవాణి అందిస్తుండగా, కథను వీ విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. సంభాషణలను దేవ కట్ల రాస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో, ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పలు భారతీయ భాషల్లో విడుదల చేయాలని చిత్ర బృందం ప్రణాళికలు రూపొందిస్తోంది. అయితే చిత్రానికి సంబంధించిన కథ, పాత్రలు, బడ్జెట్ వంటి వివరాలపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# 'డ్రాగన్'లో కృతి సనన్ ఎంట్రీ?

యంగ్ టైగర్ జూనియర్ఎ న్టీ రామారావు జూనియర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్'పై తాజాగా ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో ఇప్పటికే పలువురు ప్రముఖ నటీనటులు భాగమవుతుండగా, తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో కథకు సంబంధించిన ప్రధాన పాత్రలను పరిచయం చేసిన ప్రశాంత్ నీల్, అసలు కథలోని కీలక సంఘర్షణను మాత్రం రహస్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఆ ప్రధాన కథా ట్రాక్‌లోనే కృతి సనన్ పాత్ర ఉండొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమాలు డార్క్ టోన్, బ్లాక్ అండ్ గ్రే షేడ్ విజువల్స్‌తో ప్రత్యేక గుర్తింపు పొందుతాయి. అయితే 'డ్రాగన్'లోని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను పూర్తిగా కలర్‌ఫుల్ విజువల్స్‌తో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈ భాగంలో ప్రశాంత్ నీల్ శైలికి భిన్నమైన విజువల్ ట్రీట్ కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్Arts సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# 'సుభాష్'గా ఆర్యన్ శ్యామ్



భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత కథ ఆధారంగా ఓ ప్రతిష్టాత్మక బయోపిక్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ (జెమిని ఫిల్మ్ సర్క్యూట్) నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'సుభాష్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో నేతాజీ పాత్రను యువ నటుడు ఆర్యన్ శ్యామ్ పోషించనుండగా, దర్శకుడు ఆనంద్ వి. ప్రసాద్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారు. సుభాష్ చంద్రబోస్ అసాధారణ జీవిత ప్రయాణం, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్ర, దేశభక్తి భావజాలం, నాయకత్వ లక్షణాలను ఈ చిత్రంలో ఆవిష్కరించను న్నారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన పోరాట స్ఫూర్తి, దేశ చరిత్రపై చూపిన ప్రభావం వంటి అంశాలను విస్తృత పరిశోధనల ఆధారంగా తెరపైకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.




# సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకున్నా!

టాలీవుడ్ నటి నివేదా పేత్‌రాజ్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా అభిమానులతో పంచుకున్నారు. 'అలా వైకుంఠపురములో', 'బ్రోచేవారెవరురా', 'రెడ్', 'పాగల్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన ఆమె, కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల విడుదలైన 'సింగ్ గీతం' సినిమా సక్సెస్ మీట్‌లో పాల్గొన్న నివేదా పేతురాజ్, తన కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టకాలాన్ని గుర్తుచేసుకున్నారు. 2023లో తాను సినిమాలకు పూర్తిగా గుడ్‌బై చెప్పాలనే నిర్ణయానికి వచ్చానని, ఆ సమయంలో తన ప్రణాళికలు అనుకున్నట్లుగా సాగలేదని తెలిపారు. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత 'సింగ్ గీతం'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మరో అవకాశం ఇచ్చిన నాగ్ అశ్విన్ వల్లే తాను మళ్లీ సినిమాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. "నాగ్ అశ్విన్ నాకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఆయన ప్రోత్సాహం లేకపోయి ఉంటే నేను ఈరోజు ఇక్కడ ఉండేదాన్నో కాదో తెలియదు" అంటూ భావోద్వేగంగా స్పందించారు. కాగా, ఇటీవల విడుదలైన 'సింగ్ గీతం' చిత్రానికి ప్రముఖ దర్శకుడు సంగీతం శ్రీనివాస్‌రావ్ దర్శకత్వం వహించగా, నాగ్ అశ్వన్ నిర్మాణ బాధ్యతలు నిర్వహించారు. ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది.

# రాజ్ నిడిమోరు మూవీలో సల్మాన్ ఖాన్?



'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి విజయవంతమైన వెబ్ సిరీస్‌లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాజ్ నిడిమోరు ఇప్పుడు ఓ భారీ బాలీవుడ్ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన రాబోయే ప్రాజెక్టుల గురించి ఆసక్తికర వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ పనులు కొనసాగుతున్నాయని, అది ప్రీ – ప్రొడక్షన్ దశలో ఉందని రాజ్ తెలిపారు. అలాగే మరో వెబ్ సిరీస్ అభివృద్ధి దశలో ఉండగా, తమ హిందీ సినిమా నిర్మాణం కూడా త్వరలో ప్రారంభం కానుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను ఆకట్టు కునేలా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా నటించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.



## 'ధ్రువ నక్షత్రం'పై

# కీలక తీర్పు..

## గౌతమ్ మీనన్‌కు మరో అవకాశం దక్కుతుందా?

చియాన్ విక్రమ్ హీరోగా, దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తెరకెక్కించిన 'ధ్రువ నక్షత్రం' చిత్రం విడుదల సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. నిర్మాతలు, పెట్టుబడిదారులు, ఫైనాన్షియర్ల మధ్య నెలకొన్న ఆర్థిక వివాదాల కారణంగా ఈ సినిమా చాలా కాలంగా విడుదలకు నోచుకోలేదు. ఇప్పటికే పలు దఫాల విచారణల అనంతరం, జూన్ 15లోపు సినిమాను విడుదల చేస్తానని గౌతమ్ మీనన్ మద్రాస్ హైకోర్టుకు హామీ ఇచ్చారు. ఆ మేరకు కోర్టు ఆయనకు గడువు కూడా మంజూరు చేసింది. అయితే నిర్ణీత సమయంలో సినిమాను విడుదల చేయడంలో ఆయన విఫలమవడంతో, తాజాగా మరో నెల రోజుల గడువు కోరుతూ జూలై 15 వరకు సమయం ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై కోర్టు నిర్ణయం వెలువరించనుంది. ఇదే సమయంలో, సినిమా ఫైనాన్షియర్లు కె. ప్రేమ్ కుమార్, కె. పుణ్యమూర్తి దాఖలు చేసిన పిటిషన్ కూడా విచారణకు రానుంది. తమ ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతిన్నాయని, వాటాల పంపకంపై స్పష్టత లేకపోవడంతో న్యాయం చేయాలని వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో నేటి విచారణ *'ధ్రువ నక్షత్రం'* భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా మారింది. కోర్టు గౌతమ్ మీనన్‌కు మరింత గడువు ఇస్తుందా? లేక ఫైనాన్షియర్ల వాదనలకు అనుకూలంగా తీర్పు వెలువడుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com